

మృతుడి కుటుంబానికి బీమా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మృతుల కుటుంబాలకు బీమా చెక్కుల పంపిణీ

జనగామ, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ సభ్యత్వం కలిగి వివిధ కారణాలతో మృతి చెందిన ఇద్దరు కార్యకర్తల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున బీమా చెక్కులను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జడ్పీచైర్‌పర్సన్ భాగ్యలక్ష్మితో కలిసి అందజేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బచ్చన్నపేట మండలం నారాయణపురానికి చెందిన కోడం రమేశ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన భార్య లావణ్యకు చెక్కు అందజేశారు. నర్మెట మండలం అమ్మాపురానికి చెందిన సలేంద్ర యాదగిరి విద్యుత్ షాక్‌తో మరణించగా ఆయన భార్య విజయకు బీమా చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బచ్చన్నపేట, నర్మెట మండలాల బీఆర్ఎస్ నాయకులు ఇర్రి రమణారెడ్డి, జడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్, ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు గౌస్‌పాషా, మండల పార్టీ అధ్యక్షులు చింతకింది సరేశ్‌రెడ్డి, నాయకులు పెద్ది రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనగామ జిల్లా పేరు మార్చొద్దు

ఎమ్మెల్యే పల్లాకు జేఏసీ నేతల వినతి

జనగామ చౌరస్తా, జూన్ 3 : జనగామ జిల్లా పేరును మార్చొద్దని డిమాండ్ చేస్తూ సోమవారం జేఏసీ నాయకులు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా కన్వీనర్ మంగళంపల్లి రాజు మాట్లాడుతూ ఈ అంశంపై ఎమ్మెల్యే పల్లా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వందలాది మంది ఉద్యమకారులు త్యాగాలతో జిల్లాను సాధించినట్లు పేర్కొన్నారు. జిల్లా ఏర్పడి ఎనిమిదేళ్లు పూర్తికావొచ్చిందని, ఇంకా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. జనగామ అంటే బమ్మెర పోతన, పాల్కురికి సోమనాథుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య, వీరనారి చాకలి ఐలమ్మ, బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్, షేక్ బందగీ, ఒగ్గు కథ పితామహుడు చుక్క సత్తయ్య, సుద్దాల హనుమంతు, నల్లా నర్సింహులు వంటి ఎందరో చరిత్రకారులు గుర్తుకు వస్తారని తెలిపారు. ఇలాంటి నేపథ్యం ఉన్న జిల్లాకు ఏ ఒక్కరి పేరునోపెట్టి మిగతా యోధులను అవమానపర్చొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. జిల్లా అభివృద్ధిని పక్కనపెట్టి, పేరు మార్పు అంశంతో ప్రజలను విభజించే కుట్రలను రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు గన్ను కార్తీక్, తుంగ కౌశిక్, సల్ల మహేశ్, సుభాష్, అశోక్, పవన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పల్లాకు వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

చీటకోడూరు వాగుపై వంతెన నిర్మించాలని వినతి

జనగామ రూరల్, జూన్ 3: జనగామ మండలం చీటకోడూరు వాగుపై వంతెన నిర్మించాలని పరిసర గ్రామాల ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత వర్షాకాలంలో వరదల ఉధృతికి చీటకోడూరు రిజర్వాయర్ గేట్లు ఎత్తడంతో నీటి ప్రవాహం పెరిగి వంతెన కొట్టుకుపోయిందన్నారు. వాగుపై ఆధునికరీతిలో వంతెన నిర్మిస్తే సుమారు పది గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, చౌడారం మాజీ సర్పంచ్ సలేంద్ర కొమురయ్యయాదవ్, బీఆర్ఎస్ యువ జన నాయకుడు యాసారపు ప్రవీణ్, నాయకులు కరుణాకర్, మానికాయాదవ్, రమేశ్ పాల్గొన్నారు.

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పక్కన మాజీ మంత్రి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే రాజయ్య, హాజరైన పార్టీ శ్రేణులు

తెలంగాణ ద్రోహి రేవంత్‌రెడ్డి

- అమరవీరుల గురించి మాట్లాడే హక్కు లేదు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- పోలీసు కేసులకు, బెదిరింపులకు భయపడం..
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- ఘనంగా తెలంగాణ దశాబ్ది ముగింపు వేడుక
- బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ, జాతీయ జెండాల ఆవిష్కరణ
- హాజరైన మాజీ ఎమ్మెల్యే రాజయ్య, జడ్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్లు భాగ్యలక్ష్మి, జమున

జయశంకర్ సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు, నాయకులు

జనగామ, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉద్యమంలో ఏనాడు పాల్గొనని సీఎం రేవంత్‌రెడ్డి అమరవీరుల త్యాగాల గురించి మాట్లాడే హక్కు లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. నాడు నేను, కడియం శ్రీహరి టీడీపీలో ఉన్నవాళ్లమే..ఆనాడు నా నాయకత్వంలో ప్రత్యేక రాష్ట్రం కోసం రాజీనామా చేస్తానని సంతకాలు సేకరించి చంద్రబాబుతో కొట్లాడి తెలంగాణ కోసం లేఖ ఇప్పించి ఉద్యమంలో పాల్గొన్నానని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను సోమవారం నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో కలిసి ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని దవాఖానలు, అనాథ శరణాలయాల్లో పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి, వివిధ గ్రామాల్లో గులాబీ జెండాలను ఎగురవేశారు. యశ్వంతాపూర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించిన అనంతరం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ జెండాను, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ కోసం ఆవిర్భవించిన టీఆర్ఎస్ పార్టీ, అధినేత కేసీఆర్ ప్రాణత్యాగానికి సిద్ధపడి రాష్ట్రాన్ని సాధించడం.. స్వరాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రజల సహకారంతో దశాబ్దకాలం పాటు ప్రగతి సాధించి దేశానికే ఆదర్శంగా తెలంగాణను ముందువరసలో నిలిపిన తీరును గుర్తుచేసుకున్నారు. అనంతరం మాజీ మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ నాడు టీడీపీలో ఉన్న రేవంత్‌రెడ్డి, కడియం శ్రీహరి తెలంగాణకు మద్దతు ఇవ్వకపోగా, బాబు లేఖ ఇవ్వకుండా అడ్డుపడిన ద్రోహులని మండిపడ్డారు. అలాంటి వ్యక్తులకు తెలంగాణ గురించి, అమరవీరుల త్యాగాల గురించి మాట్లాడే హక్కులేదని స్పష్టం చేశారు. నాటి సీఎం కేసీఆర్‌తో మాట్లాడి సాధించుకున్న జనగామ జిల్లాను తొలగించేందుకు కాంగ్రెస్ సర్కారు యత్నిస్తున్నదని, ఈ క్రమంలో ప్రజలు మరో ఉద్యమానికి సిద్ధపడాలని ఎర్రబెల్లి పిలుపునిచ్చారు. నాటి ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య త్యాగం వల్లే జనగామ జిల్లా వచ్చిందని గుర్తు చేశారు.

కేసులకు భయపడేది లేదు : పల్లా

ఆరునెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నియమావళి ఉల్లంఘన పేరిట జనగామ పోలీస్‌స్టేషన్‌లో పెట్టిన కేసులపై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. ఎన్నికల సమయంలో తాను ఏదైనా తప్పు చేస్తే ఎన్నికల సంఘం కేసు నమోదు చేయాలి తప్ప ఓ కాంగ్రెస్ నాయకుడు ఒత్తిడి చేస్తే పోలీసు అధికారులు తనపై కేసు నమోదు చేయడం దారుణమని అన్నారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడే వ్యక్తిని కాదని, తెలంగాణ ఉద్యమంలోనే లెక్కలేనన్ని కేసులు పెడితే భయపడలేదని గుర్తు చేశారు. అటు స్టేషన్‌ఘన్‌పూర్‌లో.. ఇటు జనగామలో కాంగ్రెస్ నాయకులు పోలీసులను బెదిరించి, ఒత్తిడి చేసి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టించి భయపెట్టాలని చూస్తున్నారని ఎమ్మెల్యే పల్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. నాపై పోటీ చేసి ఓడిపోయిన కాంగ్రెస్ నాయకుడు తన కొడుకులకు సామంత రాజ్యాలు రాసిచ్చినట్లు ఒకరికి జనగామ..మరొకరికి చేర్యాల ఇచ్చినట్లు ఊహించుకొని విచ్చలవిడిగా ఊరిమీద పడుతున్నారని ఆయన విమర్శించారు. షెడ్యూల్ వచ్చి నోటిఫికేషన్ రాకముందే టీ తాగుతూ ప్రజలతో మాట్లాడుతుంటే కేసులు పెట్టారన్నారు. పోలీసులు ప్రజారక్షకులుగా ఉండాలి.. కానీ జనగామ పోలీసులు ప్రజాభక్షకులుగా తయారయ్యారని..అమాయకులను చూసి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. గ్రామాల్లో చిన్న చిన్న భూవివాదాల్లో తలదూర్చి డబ్బులు గుంజుతున్నారని విమర్శించారు. ఇలాగే కొనసాగితే చూస్తూ ఊరుకోమని, అవసరమైతే ప్రజల కోసం పెద్దఎత్తున ఉద్యమాన్ని చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, జడ్పీచైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏడవెల్లి కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, బీఆర్ఎస్ నాయకులు గద్దల నర్సింగరావు, ఇర్రి రమణారెడ్డి, గాంధీనాయక్, బండ యాదగిరిరెడ్డి, జడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి చిత్రపటాన్ని అందిస్తున్న జీడి ప్రసాద్

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన జీడి ప్రసాద్

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 3 : తెలంగాణ రాష్ట్ర హస్తకళా అవార్డు గ్రహీత, కడియం యువసేన స్టేషన్‌ఘన్‌పూర్ మండల అధ్యక్షుడు జీడి ప్రసాద్ హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం కలిశారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకల సందర్భంగా రావి ఆకుపై రేవంత్‌రెడ్డి చిత్రాన్ని వేసి ట్యాంక్ బండ్ వద్ద జరిగిన వేడుకల్లో సీఎంకు అందించినట్లు జీడి ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర హస్తకళా అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆలగు వర్షిణి పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలోనే రాష్ట్రంలో అభివృద్ధి

జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తున్న పోకల జమున

జనగామ చౌరస్తా, జూన్ 3 : ఉద్యమ నేత కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ముగింపు ఉత్సవాలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేశ్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రితో పాటు రాజరాజేశ్వరి వృద్ధాశ్రమంలో రోగులకు, అనాథ వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జమున మాట్లాడుతూ జన నేత కేసీఆర్ పాలనలో రాష్ట్రం విద్య, వైద్యం, ఉపాధి, పరిశ్రమలతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, కూలీలు, నిరుద్యోగులు, మహిళలు, పరిశ్రమలు, వ్యాపార సంస్థల నిర్వాహకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కరెంట్ కోతలు, సాగు, తాగు నీటి సమస్య నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు వాంకుడోత్ అనిత, గుర్రం భూలక్ష్మి, పేర్ని స్వరూప, కోఆప్షన్ మెంబర్ పానుగంటి రాహెల, నాయకులు గుర్రం నాగరాజు, తిప్పారపు విజయ్‌కుమార్, ఎనగందుల కృష్ణ, ఉల్లెంగుల సందీప్, కన్నారపు వంశీ పాల్గొన్నారు.

పాలిసెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

బానోత్ రియా, వలబోజు సాత్విక్, ఎక్కలదేవి చరిత

జనగామ చౌరస్తా, జూన్ 3 : పాలిసెట్–2024 ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభక నబర్చారు. నర్మెట మండలం ఉసికెబాయి తండాకు చెందిన బానోతు రియా ఎంపీసీ, ఎంబైపీసీ విభాగాల్లో జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకుతో పాటు రాష్ట్ర స్థాయిలో 194 (ఎంపీసీ), 143 (ఎంబైపీసీ) ర్యాంకును సాధించింది. లద్నూరు(ప్రస్తుతం జనగామ)కు చెందిన వలబోజు సాత్విక్ జిల్లా స్థాయిలో ద్వితీయ ర్యాంకుతో పాటు రాష్ట్ర స్థాయిలో 266 (ఎంపీసీ), 145 (ఎంబైపీసీ) ర్యాంకును సాధించారు. జనగామ పట్టణం సాయినగర్‌కు చెందిన ఎక్కలదేవి చరిత ఎంపీసీ విభాగంలో జిల్లా స్థాయిలో తృతీయ ర్యాంకుతో పాటు రాష్ట్ర స్థాయిలో 321 ర్యాంకు పొందింది. జఫర్‌గఢ్ మండలం ఉప్పుగల్లుకు చెందిన తాటి రాంచందర్ ఎంబైపీసీ విభాగంలో జిల్లా స్థాయిలో తృతీయ ర్యాంకుతో పాటు రాష్ట్ర స్థాయిలో 222 ర్యాంకును సాధించారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

జనగామ రూరల్, జూన్ 3 : మండలంలోని యశ్వంతాపూర్‌కు చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు లద్దనూరి మహేశ్ తల్లి యాదమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎంపీపీ మేకల కళింగరాజు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట నాయకులు సింగరి ప్రశాంత్ యాదవ్, కొండబోయిన రాజు యాదవ్, బోళ్ల సంపత్ యాదవ్, నరేశ్ ఉన్నారు.

ప్రభుత్వ దవాఖానలో ప్రసవాల సంఖ్య పెంచాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్‌రాజ్

బాలింతను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

జఫర్‌గఢ్, జూన్ 3 : ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య మరింత పెంచాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో శస్త్ర చికిత్స విభాగాన్ని (ఆపరేషన్ థియేటర్) ఆయన ప్రారంభించారు. హరీశ్‌రాజ్ మాట్లాడుతూ దవాఖానల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. అత్యవసరమైన వారికి ఆపరేషన్ చేసి తల్లి, బిడ్డను సంరక్షించాలని వైద్యులను కోరారు. దవాఖానకు వచ్చే రోగులపట్ల సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని ఆదేశించారు. అనంతరం మండల వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఇద్దరు గర్భిణులకు ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించారు. బాలింతలతో పాటు నవజాత శిశువులిద్దరు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ సూపరింటెండెంట్ డాక్టర్ పీ సుగుణాకర్‌రాజు, డాక్టర్లు మహేందర్, రవీందర్‌గౌడ్, భాస్కర్, సుధీర్‌బాబు, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో బాల్య మిత్రులు

జనగామ చౌరస్తా, జూన్ 3 : జిల్లా కేంద్రంలోని ఓ వేడుకల మందిరంలో ప్రభుత్వ ఏబీవీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం ఘనంగా జరిగింది. 1986–87 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మూడు దశాబ్దాల అనంతరం కలుసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. బాల్య స్మృతులను యాది చేసుకుంటూ సంతోషంగా గడిపారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, బాల్య మిత్రులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎల్ శ్రీధర్, నరేందర్, అప్సర్, రామలింగారెడ్డి, అశోక్, సత్య, సునీత తదితరులు పాల్గొన్నారు.

నీళ్ల కోసం రైతుల అరిగోస..

ఎల్లంలో గత సంవత్సరం నిండుకుండలా ఉన్న చెరువు



ప్రస్తుతం నీరు లేక ఎండిపోయిన చెరువు

జనగామ రూరల్, జూన్ 3: గత సంవత్సరం నిండుకుండలా ఉన్న చెరువులు నేడు నెర్రెలు వాలి దర్శనమిస్తున్నాయి. దీంతో భూగర్భ జలాలు అడుగంటి పంటలకు నీరందించలేని దుస్థితి జనగామ మండలంలో నెలకొంది. ప్రస్తుతం నార్లు పోసే సమయం కావడంతో నీరు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఎల్లంలలోని చెరువు గత సంవత్సరం నీటితో కళకళలాడింది. దీంతో రెండు పంటలు పండాయి. ఆరు నెలల నుంచి నీరు క్రమంగా అడుగంటి పశువుల దాహార్తిని తీర్చలేని దుస్థితి నెలకొంది. ఈ వర్షాకాలంలోనైనా వరుణుడు కరుణిస్తాడో లేడోనని ఆవేదన చెందుతున్నారు.

వానరాలతో కిందపడిన జాతీయ జెండా

'నమస్తే తెలంగాణ' కథనంపై అధికారి వివరణ

జనగామ రూరల్, జూన్ 3: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎంఈవో కార్యాలయంలో జరిగిన వేడుకల్లో జాతీయ జెండా కిందపడిన ఘటనపై ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో కథనం వెలువడింది. దీనిపై ఎమ్మార్పీ వంగాల రాజేందర్ స్పందించారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 8.30గంటలకు జాతీయ జెండాను ఎగురవేశామన్నారు. సాయంత్రం కోతుల స్వైరవిహారంతో జెండా కిందపడిందని తెలిపారు. గమనించిన కార్యాలయ అంటెండర్ వెంటనే జెండా కర్రను నిలబెట్టారని తెలిపారు. ఈ ఘటనలో అధికారుల తప్పు లేదని ఆయన పేర్కొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

గ్రోమోర్ సెంటర్‌లో తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ టీం

దేవరుప్పుల, జూన్ 3 : మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాల షాపుల్లో సోమవారం టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులు తనిఖీలు నిర్వహించారు. మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎస్సై చెన్నకేశవులు ఫర్టిలైజర్ షాపులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డులపై రోజువారీగా వివరాలు రాయని వారికి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి డీలర్ ప్రతి రోజూ స్టాక్ రిజిస్టర్‌ను అప్‌డేట్ చేయాలని, బోర్డుపై షాపులో ఉన్న విత్తనాలు, స్టాక్ వివరాలు తెలియజేయాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏఈవో సాగర్ ఉన్నారు.

దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎంసీహెచ్‌లో రోగులకు పండ్లు పంపిణీ

జనగామ రూరల్, జూన్ 3 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం మండలంలోని పసరమడ్ల శివారులోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పాలనలో ఉద్యమనేత కేసీఆర్ ఎంతగానో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గద్దల నర్సింగరావు, మండల అధ్యక్షుడు బైరగోని యాదగిరిగౌడ్, నాయకులు కొమ్మురాజు, పాషా, డానియల్, సతీశ్ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంటు ప్రారంభించి మాట్లాడుతున్న సీతక్క

తాగునీటి వాటర్ ప్లాంటు ప్రారంభం

బచ్చన్నపేట, జూన్ 3: హైదరాబాద్‌లోని మహాత్మాజ్యోతి రావు పూలే ప్రజాభవన్‌లో 'ప్రజావాణి 'కి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.3 లక్షల వ్యయంతో వాస్విక్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటును రాష్ట్ర మంత్రి సీతక్క సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాస్విక్ ఫౌండేషన్ సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింప చేయాలని కోరారు. ఫౌండేషన్‌కు తనవంతు సహకారం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నరేశ్‌కుమార్, వైస్‌చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

విజయోత్సవాలకు అనుమతి లేదు : ఎస్సైలు

పాలకుర్తి ఎస్సై సాయిప్రసన్నకుమార్

పాలకుర్తి/బచ్చన్నపేట, జూన్ 3: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఓట్ల లెక్కింపు నేడు జరుగుతున్న సందర్భంగా ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని ఎస్సైలు తెలిపారు. ఈ మేరకు పాలకుర్తి, బచ్చన్నపేట ఎస్సైలు సాయిప్రసన్నకుమార్, కంకల సతీశ్‌కుమార్ ఆయా మండలాల్లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వరంగల్‌లోని ఎనుమాముల మార్కెట్ గోదాముల్లో వరంగల్ లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి మంగళవారం ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. భువనగిరి లోక్‌సభ స్థానానికి బరిలో నిలిచిన అభ్యర్థుల ఓట్ల లెక్కింపు భువనగిరిలో జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు ఎలాంటి ఊరేగింపులు, సభలు సమావేశాలు నిర్వహించేందుకు అనుమతులు లేవని వారు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా సరే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

గాలివానతో ఇంటి పైకప్పు రేకులు లేచిపోయిన దృశ్యం

పామునూరులో గాలివాన బీభత్సం

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 3: ఈదురు గాలులతో వర్షం కురవడంతో మండలంలోని పలు గ్రామాల్లో జనజీవనానికి ఆటకం కలిగింది. విద్యుత్ స్తంభాలు విరిగిపోగా చెట్లు నేలకూలాయి. పామునూరులో ఆదివారం రాత్రి గాలివాన బీభత్సానికి పొన్న భీమయ్య దేవిక దంపతుల ఇంటి పైకప్పు రేకులు లేచిపోయాయి. దీంతో ఇంట్లోని సామగ్రి నీటిపాలైంది. సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడంతోపాటు పునరావాసం కల్పించాలని కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందిస్తున్న శివకుమార్

బచ్చన్నపేట, జూన్ 3 : మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన పసుల మల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు కోడూరు శివకుమార్‌గౌడ్ సోమవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. పట్నంశెట్టి భద్రయ్య, పసుల శ్రీనివాస్, యాట నరేశ్, పులి రాములు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, Smt. RAMA DEVI, W/o. LINGALA JAGAN REDDY (Old Name), My Name Changed as LINGALA RAMA DEVI (Updation Aadhar & DOB 20-05-1953), W/o. LINGALA JAGAN REDDY (New Name), (SURNAME OF HUSBAND ADDED), R/O, 2-8-263/1/9/B, Vijayapal Colony, Road Number-3, Waddepally, Hanumakonda Dist., T.S., -506370.

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్, హైద